సాక్షి వికారాబాద్

సోమవారం । 24 । మార్చి । 2025



ఊపిరి తీస్తున్న 'క్షయ'

క్షయ మనిషి ఊపిరి తీస్తోంది. కోరలు చాస్తున్న టీబీతో మరణాలు సంభవిస్తున్నాయి.


8లో▸



భక్తి భావంతో మెలగాలి

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమవారం సా. 6.33 గం.	మంగళవారం ఉ. 4.54 గం.

వడగళ్లు.. రైతుకు కడగండ్లు

అకాల వర్షంతో పంటలకు అపార నష్టం

● రైతులను ముంచిన వడగళ్ల వాన ● భారీ సైజులో పడిన రాళ్లు ● కార్లు, ఇళ్లు ధ్వంసం

ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజులుగా పలుచోట్ల వడగళ్ల వాన కురవగా.. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి. గతంలో మాదిరిగా ఈ ఏడాది సైతం మోమిన్‌పేట, మర్పల్లి మండలాల్లో అధిక నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయామని కన్నీటి పర్యంతమవుతున్నారు. అర కిలో సైజులో వడగళ్లు పడడంతో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. పౌల్ట్రీ రైతులు నష్టం చూడాల్సి వచ్చింది. గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. – వికారాబాద్

మోమిన్‌పేట: ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసింది. దీంతో పంట నేల పాలైంది. శనివారం కురిసిన వడగళ్ల వానతో మండల పరిధిలోని ఏన్కతల, కాస్లబాదు, టేకులపల్లి గ్రామాల్లో బొప్పాయి, టమాట, ఉల్లి, కాలీఫ్లవర్, వంకాయ, పచ్చిమిర్చి, పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిగా.. గోవిందాపూర్, రాంనాథ్‌గుడుపల్లి, మల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊట దశలోని ఉల్లి, మొక్కజొన్న పంటలు పాడయ్యాయి. మిగిలిన గ్రామాల్లో కురిసిన వర్షాలకు ఉల్లి పంట పాడైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్చింగ్‌తో వేసిన టమాట, మిర్చి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా మిగల లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం కురిసిన వడగండ్ల వానకు ఇదే మాదిరిగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. సుమారు 400 ఎకరాల్లో కూరగాయ పంటలు, 20 ఎకరాల్లో బొప్పాయి, ఐదెకరాల్లో పూల తోటలు, నాలుగు ఎకరాల్లో పుచ్చ తదితర పంటలు పాడయ్యాయని ఆవేదన వెల్లిబుచ్చుతున్నారు. వెయ్యి ఎకరాల్లో ఉల్లి సాగుకుగాను 400 ఎకరాల్లో పూర్తిగా 600 ఎకరాల్లో పాక్షికంగా నష్టపోయామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



మోమిన్‌పేట: ఏన్కతలలో పాడైన ఉల్లి పంట

పిడుగుపాటుకు గేదె మృతి

బొంరాస్‌పేట: మండల పరిధిలో ఆదివారం కురిసిన అకాల వర్షంతో చౌదర్‌పల్లిలో రైతు కోడి కృష్ణకు చెందిన పాడిగేదె పిడుగుపాటుకు మృతి చెందింది. రూ.1.30లక్షల విలువ చేసే పాడిగేదె మృతి చెందిందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లో..



ధారూరు: ధారూరు మండలంలోని ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లో ఆదివారం వడగళ్ల వాన కురిసింది. చేతికి వచ్చిన జొన్న, వరి పంటలు పాడయ్యాయి. కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉడకించి ఆరబెట్టిన పసుపు వానకు తడవడంతో రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మామిడి కాయలు నేలరాలాయి.



ధర్మాపూర్‌లో కురుస్తున్న వడగళ్ల వాన

❖ వర్ష బీభత్సం

దుద్యాల్: ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. అల్లిఖాన్‌పల్లి శివారులోని దుద్యాల్ ఆశ్రమం వెనుక పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ , విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై చెట్టు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హస్నాబాద్, ఆలేడ్, కుదరుమల్ల, దుద్యాల, లగచర్ల తదితర గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.



అల్లిఖాన్‌పల్లిలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

❖ నేలకొరిగిన జొన్న

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్, మోత్కుపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వానకు జొన్న పంట నేలకొరిగింది. ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు భయాందోళన చెందారు. రోడ్లపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈదురు గాలులకు ఇబ్బందులు పడ్డారు.



మోత్కుపల్లిలో నేలకొరిగిన జొన్నపంట

తీవ్రంగా నష్టపోయా



రెండు ఎకరాల్లో ఉల్లి, రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఉల్లి సాగుకు రూ.80వేల పెట్టుబడి పెట్టా. ఊట దశలో ఉంది. ఆకు పూర్తిగా తూట్లు పడి పోయింది. మొక్కజొన్న కంకులు వచ్చే దశలో ఉంది. ఆకులు పూర్తిగా రాలిపోయాయి. అకాల వర్షానికి తీవ్రంగా నష్టపోయా. వ్యవసాయాధికారులు సర్వే చేసి ప్రభుత్వం పంట పరిహారం అందిచేలా చర్యలు తీసుకోవాలి.

– మెట్టు రాములు, రైతు, ఏన్కతల

పరిహారం ఇవ్వాలి



వడగళ్ల వానకు పంటలు పాడయ్యాయి. ఎక్కువగా ఉద్యాన పంటలుండడంతో రైతులు కోలుకునే పరిస్థితి లేదు. రూ.లక్షల్లో పెట్టుబడిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ హయాంలో వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చాం. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి తాత్సారం చేయకుండా ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– ఆనంద్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

నేడు శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి

ధారూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోతులు, అడవి పందుల బెడద వాటి నివారణ, పంటల యాజమాన్యం, వానాకాలం, యాసంగి పంటల సాగు మెళకువలను రైతులకు శాస్త్రవేత్తలు వివరంచనున్నారు. గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొంటారని, ధారూరు రైతు క్లస్టర్ పరిధిలోని రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతు నాయకులు తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

కొడంగల్: ప్రాథమిక సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పీఏసీఎస్ సహకార సంఘం ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, పంట రుణాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. మార్చి 31 లోపు పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. రెన్యూవల్ చేయించని ఎడల ఏడు శాతం, సకాలంలో రుణాలు చెల్లించని వారికి 13 శాతం వడ్డీ పడుతుందన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



డాక్టర్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

అనంతగిరి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మా శారద ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాజశేఖర్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎంఏ ప్రతినిధులు ఆయనను శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు సాధు సత్యనాథన్, కార్యదర్శి శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్, శాంతప్ప, శ్రవణ్, జయంతిక, ఆశాజ్యోతి, రమ్య, గిరీష, సుఖప్రద తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృత్యువాత



జింక కళేబరం

దోమ: కుక్కల దాడిలో జింక మృత్యువాత పడింది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. ఆదివారం స్థానిక చెరువులో నీరు తాగేందుకు వచ్చిన జింకను చూసిన వీధి కుక్కలు వెంబడించి దాడి చేయడంతో జింక మృత్యువాతపడింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో అటవీ ప్రాంతంలో జంతువులకు సమృద్ధిగా తాగునీరు ఏర్పాటుచేయకపోవడం వల్లనే వన్యప్రాణులు జనసంచారంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలం-హైదరాబాద్ రహదారిని విస్తరించండి

కడ్తాల్: శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని స్థానిక బీజేపీ నాయకులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ రాష్ట్ర నాయకుడు ఆచారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి (ఎన్‌హెచ్765) రద్దీగా మారిందని, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. విస్తరణతో రద్దీని, ప్రమాదాలను నివారించొచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే రోడ్డుకు సంబంధించి డీపీఆర్ పూర్తయిందని, త్వరలోనే టెండర్లు పిలిచి రోడ్డు విస్తరణ పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్‌దోనాదుల, కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పద్మశాలీ సంఘం నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం ఆమనగల్లు పట్టణానికి చెందిన పద్మశాలీసంఘం నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయనను ఆమనగల్లు భక్తమార్కండేయ దేవస్థాన కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, పద్మశాలీసంఘం నాయకులు అప్పం శ్రీనివాస్, మసున మురళీధర్, యాదగిరి కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు భక్త మార్కండేయ స్వామి దేవాలయ ఆవరణలో కమ్యూనిటీ హాలు, వసతిగృహం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని సీఎంకు వినతిపత్రం అందించారు.

లేబర్ అడ్డాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

మొయినాబాద్: భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డాల వద్ద ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు లేక కార్మికులు గంటల తరబడి రోడ్లపైనే పనికోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. తాగునీరు, టాయిలెట్స్ లేక మహిళా కార్మికులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలస కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని.. బడా నిర్మాణ సంస్థలు తక్కువ కూలీ ఇచ్చి 12–14 గంటలు పనిచేయించుకుంటున్నాయని ఆరోపించారు. ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతే ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే సొంత ఊళ్లకు పంపిస్తున్నారని.. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలానే వెలుగు చూశాయన్నారు. ఇలాంటి సమస్యలన్నింటిపై భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 21, 22తేదీల్లో శంషాబాద్‌లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని.. ఈ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఏప్రిల్ 21న శంషాబాద్‌లో జరిగే ర్యాలీ, బహిరంగ సభకు భవన నిర్మాణ కార్మికులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, కార్యదర్శి సత్యానారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు

15 నెలల్లోనే అభివృద్ధి మార్కు

- ఏడాది కాలంలో నియోజకవర్గంలో రోడ్డు పనులు పూర్తి
- ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పదేళ్లుగా కుంటుపడిన అభివృద్ధిని 15 నెలల్లోనే పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో నియోజకవర్గ ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా సుస్థిర పరుస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నియోజకవర్గంలో గ్రామా ల్లో కోట్ల నిధులు వెచ్చించి రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామని వివరించారు. ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. త్వరలోనే నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నా రు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో అర్హులకు ప్రభుత్వ ఫలాలు అందజేస్తామని వివరించారు. ఇందిరమ్మ కమిటీల పనితీరుపైనే ఎన్నికల ఫలితా లు ఆధారపడి ఉంటాయని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి పనులు దండిగా కొనసాగే అవ కాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేశ్ మహరాజ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమి టీ చైర్మన్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, అంజయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు మురళీకృష్ణాగౌడ్, భీమయ్య, అజయ్‌ప్రసాద్, నర్సింహులుగౌడ్, కావలి సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ గురువయ్యగౌడ్‌కు సీపీ ప్రశంస

షాబాద్: హత్య కేసులో నిందితుడికి జీవిత కారాగార శిక్ష విధించడంలో కీలకపాత్ర పోషించిన ట్రాఫిక్ అడ్మిన్ సీఐ గురువయ్యగౌడ్‌ను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అభినందించారు. 2023లో షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామర్లపల్లిలో జరిగిన హత్య కేసులో అప్పటి సీఐగా ఉన్న గురువయ్యగౌడ్ ఇన్వెస్టిగేషన్ చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా నిందితుడికి జీవిత ఖైదు శిక్షపడింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాశ్‌మహంతి సీఐ గురువయ్యగౌడ్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. ప్రస్తుతం గురువయ్యగౌడ్ ట్రాఫిక్ అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా సైబరాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

- మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- పూడూరు హైవేపై 20 ఎకరాల స్థల సేకరణకు యోచన
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పరిగి: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు మార్కెటింగ్‌కు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పూలు, పండ్లు, కూరగాయలు సాగు చేస్తున్న రైతులు పంట విక్రయించాలంటే నగరానికి వెళ్లాల్సిందే. పండించిన పంట జిల్లాలోనే విక్రయిస్తే తక్కువ ఖర్చుతో పాటు మంచి ధర లభిస్తుందని స్థానిక రైతులు పలు మార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లారు. సరైన మార్కెట్ లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇదే విషయాన్ని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం ఉద్యాన మార్కెట్ ఏర్పాటుకు కసరత్తు మొదలు పెట్టింది. పంట విక్రయానికి వీలుగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్ నిర్మించాలని తలపించింది. దీన్ని పూడూరు హైవేపై ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను మార్కెటింగ్ శాఖ సిద్ధం చేసింది. ఇందుకు కసరత్తు ప్రారంభించిన మార్కెటింగ్ శాఖ విపణి ఏర్పాటుకు స్థల సేకరణ పనిలో నిమగ్నమయింది.



53,132 ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో 53,132 ఎకరాల్లో పూలు, పండ్లు, కూరగాయలు తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దిగుబడిని హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నారు. కొంత మంది రైతులు స్థానిక మార్కెట్‌లో విక్రయించడంతో గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం ఉద్యాన మార్కెట్ ఏర్పాటుకు తలపించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ ఏర్పాటు చేస్తే సాగు రెట్టింపు అవుతుందని పలువురు రైతులు వెల్లడిస్తున్నారు. వికారాబాద్, పరిగి నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఉద్యానవన పంటలు సాగు చేస్తుంటారు.

20 ఎకరాల్లో మార్కెట్

కొత్తగా ఏర్పాటు చేయనున్న ఉద్యావన మార్కెట్ 20 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. హైవేకు, రైల్వే లైన్‌కు దగ్గరగా ఉండేలా స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోని పూడూరు మండల శివారులో మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని మార్కెటింగ్ శాఖ యోచిస్తోంది. మార్కెట్ ఏర్పాటుకు 20ఎకరాల స్థలాన్ని ఇప్పించాలని మార్కెట్ శాఖ జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే లేఖ రాసింది. దీంతో కలెక్టర్ ప్రతీక్ జైన్ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి స్థల సేకరణ చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం.

రైతులకు మేలు



పూడూర్‌లో ఉద్యానవన మార్కెట్ ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతుంది. కూరగాయాలను, పూలను, పండ్లను స్థానికంగానే విక్రయించుకోవచ్చు. దీంతో రవాణా ఖర్చు తగ్గుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుంది.

– పరశురాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, పరిగి

క్లుప్తంగా

నూతన పంచాంగం ఆవిష్కరణ



మంత్రి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందిస్తున్న వాసుదేవశర్మ

కొడంగల్ రూరల్: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. ఆదివారం నగరంలోని తన నివాసంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ధూప దీప నైవేద్య అర్చక సంఘం(డీడీఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి నేతృత్వంలో జిల్లాలోని అర్చక బృందం హాజరైంది. కార్యక్రమంలో కిట్టు స్వామి(విజయకృష్ణ జ్యోషి) తదితరులున్నారు.

భక్తి భావంతో మెలగాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి 38వ బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఆయన.. పలువురిని సన్మానించి, ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సహకారంతోనే స్వామివారి కార్యక్రమం పూర్తయిందన్నారు. స్వామివారికి సేవ చేయడమంటే.. పూర్వజన్మ సుకృతమేనని, ఏటేటా ఉత్సవాలను మరింత బ్రహ్మాండగా జరుపుకొందామని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి, కమిటీ సభ్యులు గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం కోట్‌పల్లి మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కోట్‌పల్లి ఎస్ఐ అబ్దుల్ గఫార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కెపల్లికి చెందిన బోయిని అశోక్(33), వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్య నవనీత కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం స్థానికులు గమనించి, భార్య నవనీతకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం


పహాడీషరీఫ్: ఆడుకునేందుకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పప్పుయాదవ్ యాదవ్ కుటుంబం నాలుగేళ్ల క్రితం వలస వచ్చి దేవేందర్ నగర్ కాలనీలో నివాసం ఉంటోంది. అతని కుమార్తె కాజల్(11) 3వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఈ నెల 22న మధ్యాహ్నం 12.30 గంటలకు ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారి.. తిరిగి రాలేదు. దీంతో బాలిక కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఇంట్లో మందలించడంతో చిన్నారి బయటకు వెళ్లిందని, తెలుగు, హిందీలో మాట్లాడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్, లేదా 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఊపిరి తీస్తున్న 'క్షయ'

- జిల్లాలో రెండేళ్లలో 4,270 కేసులు నమోదు
- ఏటా పెరుగుతున్న టీబీ రోగులు
- జిల్లాలో కొరవడిన వైద్య సేవలు
- నగరంలోని గాంధీ, చాతి ఆస్పత్రులకు పరుగు



క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది(ఫైల్)



తాండూరు: క్షయ మనిషి ఊపిరి తీస్తోంది. కోరలు చాస్తున్న టీబీతో మరణాలు సంభవిస్తున్నాయి. గతంలో అనంతగిరిలో టీబీ సానిటోరియం ఆస్పత్రి ద్వారా వ్యాధి గ్రస్తులకు వైద్య సేవలు అందించే వారు. ఆస్పత్రిని మూసి వేయడంతో జిల్లాలో టీబీ కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. నేడు ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నగరానికి పరుగు

వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి టీబీ సానిటోరియం.. దశాబ్దాల కాలం పాటు వేలాది మంది వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను అందించి ఆరోగ్యంగా మార్చింది. దీంతో రోగుల పాలిట సంజీవని అనంతగిరి అటవీ ప్రాంతంగా గుర్తింపు పొందింది. తర్వాత నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రభుత్వం పూర్తిగా సానిటోరియం.. సేవలను నిలిపి వేసింది. దీంతో జిల్లాలో టీబీ వైద్య సేవలు అందించే ఆస్పత్రులు కరువయ్యాయి. వ్యాధి తీవ్రత అధికమైతే నగరంలోని గాంధీ, లేదా ఎర్రగడ్డలోని చాతి ఆస్పత్రికి రోగులు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతానికి జిల్లాలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి, మర్పల్లి హాస్పిటల్‌లో టీబీ నిర్ధారణ పరీక్షా కేంద్రాల ద్వారా వ్యాధి గ్రస్తులను గుర్తిస్తున్నారు. వ్యాధి సోకిన వారికి మందులు ఇచ్చి పంపిస్తున్నారు.

ఎలా సోకుతుంది

క్షయ క్రిముల వలన వ్యాపిస్తుంది. ఇతరులు ఎవరైనా దగ్గితే.. వారి నుంచి బ్యాక్టీరియా మరొకరికి సోకుతుంది. రోగ నిరోధక శక్తి తగ్గిన సమయంలో వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. అంటు వ్యాధి కావడంతో ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరూ టీబి బారిన పడే ప్రమాదం ఉంది. పూర్వికుల నుంచి సోకే వ్యాధి కాదు.

గాలి ద్వారా ఊపిరి తిత్తులకు

దగ్గు ద్వారా వ్యాపించే ప్రాణాంతకరమైన వ్యాధి క్షయ. ఇది గాలి ద్వారా ఊపిరి తిత్తులకు సోకుతుంది. అక్కడి నుంచి మెదడు, కిడ్నీ ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. ఊపిరి తిత్తులకు ఇన్ఫెక్షన్ వస్తుంది. దానికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయి. మైక్రో బ్యాక్టీరియం, ట్యూబర్‌కులోసిస్ వ్యాధి సోకుతుంది. మద్యం ఎక్కువగా తీసుకునే వారికి, హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారు త్వరగా క్షయ బారిన పడతారు. నివారణకు అందుబాటులో మందులు ఉన్నాయి. క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నుంచి బయట పడవచ్చు.

27 నెలల్లో 4,250 కేసులు

జిల్లాలోని 20 మండలాల్లోని ప్రజలు అత్యధికంగా టీబి బారిన పడ్డారు. 2023లో 1,964 కేసులు, 2024లో 1,946, ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు 340 కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు ధృవీకరించారు. ఇదిలా ఉండగా.. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. గతేడాది ప్రతి నెల ఒక్కో రోగికి రూ.500 చెల్లించేది. ప్రస్తుతం గతేడాది నవంబర్ నుంచి రూ.1,000 చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లాలో వ్యాధిగ్రస్తులు ఏటా ముగ్గురు మరణిస్తున్నారు.

"అవగాహన పెంచుతున్నాం



క్షయ వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. వ్యాధి సోకిన వారికి అధికంగా దగ్గు రావడం, రాత్రి జ్వరం, తెమడతో కూడిన దగ్గు, నోట్లో నుంచి రక్తం పడటం జరుగుతుంటుంది. అలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్,రవీంద్రనాయక్,డిప్యూటీ డీఎంహెచ్ఓ

ఆమె లేని జీవితం వ్యర్థం

- ప్రియురాలు చనిపోయిందని ప్రియుడి ఆత్మహత్యాయత్నం
- గాయాలతో చికిత్స పొందుతున్న యువకుడు



చికిత్స పొందుతున్న చందు

షాద్‌నగర్‌రూరల్: ప్రియురాలు చనిపోయిందని మనస్తాపం చెందిన ప్రియుడు.. ఆమె లేని జీవితం వ్యర్థమని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన చందు.. షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతిగృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు ముగిసినప్పటికీ ఇంటికి వెళ్లలేదు. రెండు రోజులు తరువాత వెళ్తానని హాస్టల్ అధికారులకు తెలిపాడు. ఇదిలా ఉండగా.. చందు ప్రేమించిన యువతి నెల రోజులు క్రితం చనిపోయింది. దీంతో మానసిక వేదనకు గురైన అతను.. తొలుత వసతిగృహం గదిలో ఉరి వేసుకునేందుకు ఫ్యాన్‌కు బెడ్ షీట్‌ను కట్టాడు. ఏమైందో ఏమోకాని.. ఆ తరువాత హాస్టల్ భవనం రెండో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం గమనించిన సెక్యూరిటీ గార్డు వెంటనే హాస్టల్ అధికారులకు, ఇతర విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. వెంటనే గాయాలతో పడున్న చందును చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. యువకుడి ప్రాణాలకు ప్రమాదం లేదని, ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎడమ చేయి విరిగిందని తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం చందును.. కుటుంబీకులు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రేమించిన యువతి మరణంతో మనస్తాపం చెంది, ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని, పరీక్షలు సరిగా రాయలేదని చందు సోదరుడు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భవిష్యత్ ఆగం చేసుకోవద్దు

ప్రేమ పేరుతో భవిష్యత్తును ఆగం చేసుకోవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఇంటర్ విద్యార్థి చందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందును ఆయన ఆదివారం పరామర్శించి మాట్లాడారు. తల్లి తండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని పిల్లలను చదివిస్తారని, వారి ఆశలను వమ్ము చేయకుండా.. వారి కలలను సాకారం చేసేందుకు విద్యావంతులుగా ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వసతిగృహాన్ని పరిశీలించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నర్సింహులు(ఫైల్)

పరిగి: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి ఇబ్రాహింపూర్ చెరువులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రాహింపూర్ మత్స్యసహకర సంఘం సభ్యుడు రాఘవపురం నర్సింహులు(35), వృత్తి పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం చెరువులో చేపలు పట్టేందుకు వల వేయగా.. ప్రమాదవశాత్తు వల చుట్టుకుని చెరువులో పడి పోయాడు. పక్కనే ఉన్న మత్స్యకారులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించగా.. నీటిలో మునిగిపోయాడు. రాత్రి 8గంటల వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 8గంటలకు శవం పైకి తేలింది. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

డబ్బు విషయంలో తలెత్తిన ఘర్షణ



సుధాకర్ (ఫైల్)

కందుకూరు: డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సరస్వతిగూడకు చెందిన మొలగాని సుధాకర్(34) వృత్తిరీత్యా డ్రైవర్. అదే గ్రామానికి చెందిన నల్ల శమంత అలియాస్ శశికళకు అవసరాల నిమిత్తం కొన్ని రోజుల క్రితం ఆయన డబ్బును అప్పుగా ఇచ్చాడు. తిరిగి తీసుకోవడానికి శనివారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో శశికళతో పాటు ఆమె తమ్ముళ్లు శేఖర్, వినయ్‌లతో సుధాకర్‌కు గొడవ జరిగింది. దీనిపై ఆమె కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సుధాకర్ తన తల్లి వసంతతో కలిసి పీఎస్‌లో ఫిర్యాదు చేయడానికి అదే రోజు సాయంత్రం బైక్‌పై బయలుదేరాడు. గమనించిన శశికళ తమ్ముడు వినయ్ అతని బైక్‌ను అనుసరిస్తూ స్కూటీపై వస్తుండగా, లేమూరు గ్రామం దాటిన తర్వాత మరో తమ్ముడు శేఖర్ కాపు కాశాడు. అక్కడికి రాగానే సుధాకర్‌పై ఇద్దరు కలిసి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. అడ్డు వచ్చిన అతని తల్లిపై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపడి సుధాకర్ మృతిచెందాడని భావించి పరారయ్యారు. క్షతగాత్రుడిని తల్లి స్థానికుల సహాయంతో తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అతడు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భూ రాద్ధాంతం చేస్తున్నారు..



మాట్లాడుతున్న బాధితులు

యాచారం: మండలంలోని కొంటట్ పరిధిలో గల సర్వే నంబరు 60/40లోని ఎకరా అసైన్డ్ భూమిలో 60 ఏళ్లుగా కాస్తులో ఉన్నామని, భూ విషయంలో కొందరు గొడవ చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఆదివారం పట్టాదారు మహమూదాబేగం, ఆమె కుమారుడు సర్వర్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూమి తాత మహబూబ్‌సాబ్, బడేసాబ్‌ల నుంచి తమకు వారసత్వంగా అందిందని తెలిపారు. భూమిని సాగు చేస్తున్నామని చెప్పారు. 2005లో రాజీవ్ స్వగృహ కోసం భూములు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు సూచించినా, నిరాకరించామని పేర్కొన్నారు. మా భూమి పక్కనే రెవెన్యూ అధికారులు ఆటోనగర్‌కు స్థలం కేటాయించారని, రక్షణగా మా భూమికి కంచె వేసుకున్నామని వెల్లడించారు. భూమికి సంబంధించిన పాస్‌బుక్, పహాణీలను రెవెన్యూ అధికారులకు అందజేశామని చెప్పారు. అయినా కొందరు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇదే విషయంలో హైకోర్టును ఆశ్రయించామని, ఇక నుంచైనా తమపై వేధింపులు ఆపాలని కోరారు.

రెక్కీ నిర్వహించి.. భారీగా దోచేసి

ఏటీఎం చోరీ కేసులో పురోగతి

- రాజస్థాన్‌లో పట్టుబడిన హర్యానా గ్యాంగ్
- ఆదిబట్ల పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు!



చోరీ జరిగిన ఏటీఎం(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: రావిర్యాల ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసులో ఆదిబట్ల పోలీసులు పురోగతి సాధించారు. మార్చి ఒకటో తేదీ ఆదివారం అర్ధరాత్రి నాలుగు నిమిషాల్లో ఏటీఎం నుంచి రూ.29 లక్షలు అపహరించిన హర్యానా దుండగులు.. ఎట్టకేలకు రాజస్థాన్‌లో ఆదిబట్ల పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం.

ఫ్లైట్‌లో స్నేహితులను రప్పించి

ఏటీఎం చోరీ కేసులో ప్రధాన నింధితుడు 2023లో నగరంలోని జేసీబీ షెడ్డులో పని చేసేవాడు. అనివార్య కారణాల వలన హైదరాబాద్ నుంచి హర్యానాకు వెళ్లిపోయాడు. అనంతరం గత నెల 21న నగరానికి కారులో వచ్చాడు. ఏదైనా పెద్ద దోపిడీ చేయాలని పక్కా స్కెచ్ వేసుకున్నారు. ఆటోలో భువనగిరి, బీబీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడ అనుకూలంగా లేకపోవడంతో రావిర్యాల ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. మార్చి 1న హర్యానా నుంచి మరో నలుగురు స్నేహితులను ఫ్లైట్‌లో రప్పించుకున్నాడు. అదే రోజు అర్ధరాత్రి రావిర్యాల ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడి నగదును అపహరించారు. అనంతరం మైలార్‌దేవరపల్లిలో మరో ఎస్‌బీఐ ఏటీఎం దోచే క్రమంలో.. వేరే వ్యక్తుల అలజడితో అక్కడి నుంచి ఆదే రాత్రి స్విఫ్ట్ కారులో పటాన్‌చెరువు మీదుగా హర్యానా, రాజస్థాన్‌కు పారిపోయారు.

నగరంలోనే షల్టర్..

దోపిడీకి ముందు ప్రధాన నిందితుడు హైదరాబాద్‌తో పాటు పటన్‌చెరువు ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు తెలిసింది. ఓ మజీద్‌లో పని చేసే వ్యక్తి షెల్టర్ ఇచ్చాడని, అతను బీహార్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. చోరీ చేసేందుకు అక్కడే గ్యాస్ కట్టర్లు, గ్లౌజులు, ఇనుపరాడ్లు, గ్యాస్ తదితర సామగ్రి కొనుగోలు చేసినట్లు తెలిసింది.

పహాడీ వీరికి అడ్డా..

కర్ణాటక, ఒడిస్సా, కడప, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో ఈ హర్యానా గ్యాంగే ఏటీఎంలను కొల్లగొట్టినట్లు సమాచారం. రావిర్యాలలో అపహరించిన సొత్తుతో నేరుగా రాజస్థాన్‌లోని వారి అడ్డా అయిన మేవాడ్ ప్రాంతంలోని పహాడీ పోలీస్‌స్టేషన్ పరిధిలో తలదాచుకుంటారు. అక్కడే వాళ్ల రాజ్యం. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు కలిసే సెటిల్‌మెంట్ చేసుకుంటారని తెలుస్తోంది. వాళ్లను పట్టుకోవడం కూడా చాలా కష్టమని, అక్కడి ప్రజాప్రతినిధులను పట్టుకొని మధ్యవర్తిగా వ్యవహరించిన వారికి ముడుపులు ఇస్తే కాని.. సహకరించరన్నట్లు తెలుస్తోంది. 20 రోజులుగా ఆదిబట్ల పోలీసులు నాలుగు బృందాలుగా హర్యానా, రాజస్థాన్ ప్రాంతాల్లో ఆపరేషన్ చేసి నిందితులను గుర్తించినట్లు సమాచారం.

పోలీసుల అదుపులో దొంగలు

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి నేతృత్వంలో.. పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నట్లు సమాచారం. రాజస్థాన్‌లో తలదాచుకున్న నిందితులు ఇద్దరు, వారికి షెల్టర్ ఇచ్చిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారి నుంచి కొంత సొమ్ము రికవరీ చేసినట్లు, మరో నిందితుడిని ఇక్కడి పోలీసులకంటే ముందే వైజాగ్ పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏదీ ఏమైనా.. క్షణాల్లో ఏటీఎంలను కొల్లగొట్టే దొంగల ముఠాను తక్కువ తక్కువ కాలంలోనే పట్టుకొని పోలీసులు శభాష్ అనిపించుకున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



నవీష్‌ను అభినందిస్తున్న కోచ్ శంకర్‌నాయక్

షాబాద్: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శంషాబాద్ ఎస్ఎస్ స్కేటింగ్ అకాడమీ కోచ్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం నగరంలోని అండర్ 10 కాంపిటీషన్ ఎస్ఎస్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో షాబాద్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి లంబాడి నవీష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు, కోచ్ నవీష్‌ను అభినందించారు. అనంతరం కోచ్ మాట్లాడుతూ.. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అందుకు సహకరిస్తున్న వారి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

నూనె గింజల సాగు.. బాగు

రోజురోజుకూ పెరుగుతున్న ఆయిల్ ధరలు

- పత్తి, మొక్కజొన్న సాగుకు రైతులు స్వస్తి
- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు
- తెల్ల కుసుమ, పొద్దు తిరుగుడు, వేరు శనగ పంటలపై ఆసక్తి



తిర్మలాపూర్ గ్రామంలో తెల్ల కుసుమ పంట



రేగడిదోస్వాడలో తెల్ల కుసుమ పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

షాబాద్: మార్కెట్లో వంట నూనె ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. డిమాండ్ నేపథ్యంలో నూనె గింజల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండల పరిధి ముద్దెంగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, కొమరబండ, గోల్లూరుగూడ తదితర గ్రామాల రైతులు.. ఈ సంవత్సరం తెల్ల కుసుమ, పొద్దు తిరుగుడు, వేరు శనగ తదితర పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు పలు కారణాలతో నష్టాలను తెచ్చిపెడుతుండటం, నూనె గింజల పంటలకు మద్దతు ధరతో పాటు ఆదాయం వస్తుండటంతో సాగుకు సిద్ధమవుతున్నారు.

వేలాది ఎకరాల్లో తెల్ల కుసుమ

గతంలో మండల పరిధిలో ఎక్కడా తెల్ల కుసుమ, పొద్దు తిరుగుడు పంటలను సాగు చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. కానీ ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలనే ప్రభుత్వ సూచన మేరకు.. ఈ యాసంగి సీజన్‌లో 1,048 ఎకరాలకు పైగా పొద్దు తిరుగుడు, 2,814 ఎకరాలకు పైగా తెల్ల కుసుమ సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

కనువిందు చేస్తున్న పొద్దుతిరుగుడు

షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ, కొమరబండ, బొబ్బిలిగామ, తిర్మలాపూర్, లక్ష్మారావుగూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, రేగడిదోస్వాడ, ఏట్ల ఎర్రవల్లి తదితర గ్రామాల శివారుల్లో చెరువులు, బోరు బావుల కింద రైతులు నూనె గింజల పంటలు వేశారు. పొద్దు తిరుగుడు పంట పూత దశలో ఉండి ఆకర్షిస్తోంది. గతేడాది మండలంలో పొద్దు తిరుగుడు 254 ఎకరాల్లో సాగు చేయగా, ప్రస్తుతం 1,048 ఎకరాలు సాగవుతోంది. వేరుశనగ 68 ఎకరాలు కాగా.. ఇప్పుడు 218 ఎకరాలు, తెల్ల కుసుమ 1,542 ఎకరాలు కాగా.. ప్రస్తుతం 2,814 ఎకరాల్లో సాగు చేశారు. జొన్న, శనగ అంతర పంటగా 317 ఎకరాలు సాగు చేయగా, ప్రస్తుతం 624 ఎకరాల వరకు సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా. వాణిజ్య పంటలు ఏపుగా పెరుగుతుండటంతో.. మద్దతు ధరపై రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.

"తెల్ల కుసుమ సాగు చేస్తున్నాం



తెల్ల కుసుమ నూనె ఆరోగ్యానికి మంచిది. రెండేళ్లుగా సాగు చేస్తున్న. గ్రామంలో చాలా మంది రైతులు ఈ పంటలనే సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. తెల్ల కుసుమలను గానుగ ఆడించి నిల్వ చేసిన నూనెను ఏడాది పొడవునా వినియోగిస్తాం. బంధువులకు పంపిస్తుంటాం. 15 లీటర్ల డబ్బాను రూ.5 వేలకు విక్రయిస్తున్నాం.

– పర్వేద మల్లేశ్, రైతు, బొబ్బిలిగామ

కల్తీ నూనెతో అనారోగ్యం



మార్కెట్లో ఎక్కువగా కల్తీ నూనె లభిస్తోంది. దీనిని వాడిన ప్రజలు ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఆరోగ్యానికి తెల్ల కుసుమ, నల్ల కుసుమ, నువ్వులు, పల్లి నూనె మంచిది. రైతులు నూనె గింజల సాగు చేసి, ఇంటి నూనె వినియోగించుకోవాలి. ప్రజలు ఎక్కువగా తెల్ల కుసుమ నూనె కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్, మే మూడు నెలల పాటు కుసుమ నూనె పట్టిస్తారు.

– గోవుల అంజయ్య, రైతు, మక్తగూడ

సాగు విస్తీర్ణం పెరిగింది

ఈ యాసంగిలో నూనె గింజల పంటలు తెల్ల కుసుమ, పొద్దు తిరుగుడు, వేరు శనగ సాగు విస్తీర్ణం పెరిగింది. గతంలో అందరూ జొన్న, మొక్కజొన్న పంటలకే ప్రాధాన్యత ఇచ్చేవారు. కాగా నియంత్రిత సాగు వ్యవసాయ విధానం నుంచి మొక్కజొన్న పంటలు వేసే రైతులు.. ఇతర పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి లాభసాటికానున్నాయి.

– వెంకటేశం, ఏఓ, షాబాద్

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

బండ్లగూడ: ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన సంఘటన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెడిసిటీ కాలనీలో చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన దీక్షిత్(05) ఆదివారం ఉదయం కాలనీలో నడిచి వెళ్తుండగా.. గుంపుగా వచ్చిన వీధి కుక్కలు అతడిపై దాడి చేశాయి. దీనిని గుర్తించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టి బాలుడిని రక్షించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దీక్షిత్‌ను అతడి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

అమీర్‌పేట: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి(35) మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు.. రాణిగంజ్ డిపోనకు చెందిన బస్సు ఆదివారం మధ్యాహ్నం సనత్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరింది. ఎర్రగడ్డ బస్టాప్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి బస్సుకు తగలడంతో అదుపు తప్పి బస్సు వెనక చక్రాల కింద పడిపోయాడు. బస్సు అతడి మీదుగా వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు.. క్షతగాత్రున్ని గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు మద్యం సేవించి ఉన్నాడని, అతని వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.